# నాకు చచ్చిపోవాలని వుంది...

కిలకిలా నవ్వు విన్పిస్తోంది పెరట్లోనుంచి - మామిడి చిగుళ్ళు మేసి మత్తెక్కిన కోయిల కొత్త రాగం ఆలపిస్తోన్నట్టు...వర్షరుతు ప్రారంభంలో పొంగే సెలయేరు గలగలా ప్రవహిస్తోన్నట్టు...బావిదగ్గిర నీళ్లు తోడుకుంటోన్న వరలక్ష్మి నవ్వు గిలక చప్పుడును కూడా మించి శర్మ చెవులబడింది. నిద్రమత్తు ఒదిలించుకొంటూ బద్ధకంగా పక్కమీద లేచి కూర్చున్నాడు శర్మ, కిటికీలోంచి పెరట్లోకి చూస్తూ - సాయం కాలపు నీరెండలో వరలక్ష్మి కట్టిన కనకాంబరం చీర ఎర్రగా - కాంతిగా మెరుస్తోంది.

"మీ ఆయన ఊళ్ళో లేనప్పుడు నీకు పువ్వు లెందు కేమిటి?" హాస్యంగా అంది జానకి. వరలక్ష్మి మళ్ళీ నవ్వింది గలగలా - "బావుంది. ఆయన లేకపోతే నేను తిండి తిననూ? నాకు మల్లెపువ్వులంటే మహా యిష్టం. ఎవరి సంతోషం వాళ్ళదేను. రాత్రంతా భయంతో జాగారం చేస్తూ కూర్చు న్నాను. ఇవ్వాళ పగలంతా ఒళ్ళెరక్కుండా నిద్రపోతూ పడు కున్నాను. పూలకుర్రాడు వీధిలోకి రావటం నాకు తెలీనే తెలీదు. కాస్త లేపితే నేనూ కొనుక్కునేదాన్నిగా?"

"ఈ సారికి నిష్ఠూరం వెయ్యకు వరాలూ! నీ మాట మర్చిపోయాలే." అక్కడి కా మాట మార్చేస్తూ అంది

జానకి_"పోనీ రాత్రి నీ కంత భయంవేస్తే నన్ను తోడు పిలవ లేకపోయావ్. వచ్చి పడుకునేదాన్నిగా ?"

"అమ్మో! బావగారు నన్ను తిట్టుకుంటేనో." ఫక్కు మంది వరలక్ష్మి-" అంటావుగానీ నువ్వు మాత్రం రాత్రిపూట ఆయన్ని విడిచి వస్తావేమిటి?"

"చాల్లెద్దూ! నీ మాటలూ నువ్వూను. ఒక్కరోజుకి మొగుడు పారిపోతాడా ఏమిటి?"

"పారిపోవాలంటే ఎన్ని రోజులు కావా లేమిటి?"

"అబ్బ! నీతో నేను మాట్లాడలేను గానీ మీ ఆయన రావటం ఎప్పుడు?"

"మరో రెండు మూడు రోజులు వుంటారనుకుంటాను. ఏమో బాబూ! ఆయన వచ్చేవరకూ నాకు గండమే."

"ఛ! బొత్తిగా అంత పిరికితనమైతే ఎలా?"

"నీ కేం మొగుడుతో ముచ్చట్లాడ్తూ కూర్చుని అలాగే చెప్తావు. గ్రహచారం చాలకపోతే ఏ రోజు ఎలా గడుస్తుందో ఎవడికి తెలుస్తుంది? ఆడదాన్ని ఒక్క దాన్నీ వున్న అలుసు చూసి ఏ దుర్మార్గుడో ఇంట్లో జొరబడితే..." మాట పూర్తి చెయ్యకుండానే కిలుక్కుమంటూ నవ్వేసింది వరాలు. శర్మ వుత్సాహంగా పక్కదిగి కిటికీ దగ్గిరికి నడిచాడు.

వరలక్ష్మి కట్టిన చీర ఎరుపురంగు శర్మ కంటిపాపల నిండా అలుముకొంది.

జానకి కూడా సన్నగా నవ్వుతూ అంది. "సంసార్ల ఇళ్ళలో జొరబడటానికి ఎవడికమ్మా అన్ని గుండెలు?"

"ఎక్కడినుంచో రావాలా ఏమిటక్కయ్యా? ఎవరి కెప్పు డేబుద్ధి పుడుతుందో ఏం చెప్పగలం?"

అదోమాదిరిగా చూసింది జానకి - "అంటే? ఎవర్ని గురించి అంటున్నావు నువ్వు?"

"అదేమిటి? నీకు కోపం వచ్చినట్టుందే! భలేదానివి మాటవరసకంటే..."

వరాలు అన్న మాటల్ని సమర్థించుకోబుద్ధి కాలేదు జానకికి "పోనీ బుద్ధితక్కువ వాడెవడైనా ఇంట్లో జొరబడితే చేతకానిదానిలా నోరుమూసుకు ఫూరుకుంటావు కాబోలు."

"ఫూరుకోక వురేట్టుకుంటానా? అంత గ్రహచారం చుట్టుకుంటే ఆడదేం చేస్తుందక్కా? అల్లరి చేసుకుంటే ఎవరికి నష్టమో ఆలోచించావా?"

"అందుకని?" విస్మయంగా చూసింది జానకి.

"ఎందుకంత ఆశ్చర్యపోతావు? ఆడదే పిల్చిందని ఆ వచ్చినవాడు కాస్తా ప్రచారం చేస్తే అప్పుడిక ఏం దారి? దీని అలుసు లేందే వాడంత తెగిస్తాడా అని అంటుంది లోకం- సంసారం గుట్టుగా సాగిపోవాలంటే ఎలాంటి అవమానాలైనా చచ్చినట్టు కడుపులో దాచుకోవాలి. అవునా?"

"అదేమో వరాలూ! నువ్వు చాలా చిత్రంగా మాట్లాడుతున్నావు." జానకి వరలక్ష్మి మొహంలోకి కొత్తగా చూసింది.

"నే నేమీ చిత్రంగా మాట్లాడలేదు. నువ్వే ఆలోచించు బాగా."

"సరేలే. కబుర్లలో పడి కూర్చున్నాను. బోలెడు పని వుంది. నీ కేం? ఒంటరిగా ఓముద్ద వుడకేసుకుంటావు. వస్తానమ్మ!" జానకి బిందె నడుం మీదికి చేర్చుకుని వెళ్ళిపోయింది.

జానకి వెళ్ళగానే తల తిప్పి వారగా చూసిన వరలక్ష్మికి కిటికీ దగ్గిర తారట్లాడుతూన్న శర్మ స్పష్టంగా కన్పించాడు. అతని పెదవులమీద మెరుస్తోన్న చిరునవ్వుని అర్థం చేసుకోకుండానే బిందె కాస్త భుజంమీదికి ఎత్తుకుని విసురుగా నడిచి పోయింది వరలక్ష్మి. వెళ్తూ వెళ్తూ...ఇంటి మెట్లెక్కుతూ... మళ్ళీ వెనక్కి తిరిగి చూస్తే టవలు భుజంమీద వేసుకుని నూతిదగ్గిరికి వెళ్తోన్న శర్మ వెనక్కి తిరిగి చూస్తూ గబగబా ముందుకు నడుస్తూ కన్పించాడు.

*  *  *

నాలుగు వాటాల లోగి లది.

జానకి భర్త ముకుందం తాలూకా ఆఫీసులో వుద్యోగి. అతన్ని గురించి యింటా బయటా ఎవ్వరికీ చెడ్డ అభిప్రాయం లేదు. జానకి కూడా గంభీరమైన మనిషి. పధ్నాలుగు పదిహేనేళ్ళ కొడుకు వున్న ఆ దంపతుల్లో ఏ విధంగానూ చిన్నతనపు చేష్టలు కన్పించవు. పిల్ల లేమిటో...సంసార మేమిటో ... వాళ్ళ ధోరణి వాళ్ళదే.

రెండో వాటావాళ్ళు శకుంతలా శర్మా దంపతులు. శర్మని గురించి పైవాళ్ళకి తెలిసేది తక్కువేగానీ శకుంతలకి క్షుణ్ణంగా తెలుసు. భర్తలో వున్న చిత్తచాంచల్యాన్ని ఆదిలోనే కనిపెట్టిన శకుంతల సాధ్యమైనంత వరకూ భర్త దృష్టిలోకి పరాయి ఆడవాళ్ళ గాలికూడా జొరబడకుండా ఆకట్టి చూసుకొంటూ వుంటుంది. ఎక్కడెన్ని వేషాలేసినా శర్మ భార్యదగ్గిర మాత్రం తల దించి తప్పించుకొంటాడు.

పోతే మూడో వాటావాళ్ళు వరలక్ష్మి రామ్మూర్తీను. వరలక్ష్మి పరాయి మగవాళ్ళ గురించి భయపడింది గానీ, భర్త గురించి కాదుగా?

నాలుగో వాటాలో ఇంటి బామ్మగారు పదహారేళ్ళ మనవణ్ణి శ్రద్ధగా చదివించుకొంటూ ఒకరి ప్రమేయం లేకుండా కాలంగడుపుతోంది.

"వరాలు ఎవర్ని గురించి అంత మాటన్నదబ్బా!" అంటూ చాలాసేపు తనలో తను తర్కించుకొంది జానకి. తన భర్తమీద జానక్కి ఎన్నడూ అపనమ్మకం లేదు. తనకే కాదు; ఎవరికీ అపనమ్మకం లేదనే జానకి విశ్వాసం - పోతే ఇరుగు పొరుగున్న మరో మగవాడు శర్మేను. చూపులకు కాస్త దురుసుగా కన్పించినా అతనైనా ఏమంత మంచీ మర్యాదలేని మనిషి కాడు. అకస్మాత్తుగా ఓ సారి తను నూతి దగ్గిర తారసపడిపోతే వస్తూన్న వాడల్లా గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. పరాయి ఆడవాళ్ళ విషయంలో ఏ మగవాడు మాత్రం అంత బుద్ధితక్కువగా ప్రవర్తిస్తాడు? భర్తని వూరిమీదికి విడిచిపెట్టటానికి శకుంతల అంత అల్లరి

చిల్లరి మనిషా ఏమిటి? భార్య పుట్టింటికిపోతే మాత్రం అతనికి వివేకం లేదూ? ఎవర్ని గురించి భయపడిందబ్బా వరలక్ష్మి!" ఆడుకోటానికి పోయిన పిల్లలు బిలబిల్లాడుకొంటూ వచ్చిపడితే ఆలోచనకు స్వస్తిచెప్పి లేచింది జానకి.

నీళ్ళబిందె ఎత్తుకుని ఇంట్లోకివచ్చింది మొదలూ వరలక్ష్మి మనస్సంతా చికాకై పోయింది—తను వెకిలిదానిలా మాట్లాడిందో ఏమో! జానకి కనిపెట్టిందో లేదోగానీ పడగది కిటికీదగ్గిర నిలబడ్డ శర్మ తన మాటలన్నీ వింటూనే వున్నాడు. అయినా తను నోరు కట్టుకోకుండా వెనకనుంచి ఎవరో ప్రోత్సహిస్తోన్నట్టు హుషారుగా మాట్లాడింది; సిగ్గులేకుండా పకపకలాడింది - నూతిదగ్గిర కబుర్లూ, నవ్వులూ తల్చుకుంటూ తనేమిటో మర్యాదలేని మనిషిలా ప్రవర్తించినట్టు నొచ్చుకుంది వరలక్ష్మి.

కుంపట్లో బొగ్గులు ఎర్రగా మిడిసి పడుతోంటే ఎసరు పడేద్దామని లేచింది—అంతలోనే మనస్కరించక 'ఈ పూటకి కాసిని పాలు తాగిపడుకుంటే సరి.' అని స్వగతం చెప్పుకుని కుంపటికాస్తా పక్కకితోసి నిప్పులనిండా నీళ్ళుపోసింది. 'అయ్యో! కాసిని నీళ్ళయినా పడేశాను గాదు. స్నానానికి బావుండేది.' అంటూ పశ్చాత్తాప పడింది - కుంపటి గోడవారకి గెంటి లేచిపోతూ - 'ఇంతకీ శర్మగారేమనుకున్నాడో!' అంటూ తర్కించుకొంది - 'ఎప్పు డెవరికి బుద్ధిపుడుతుందో అన్నమాటలు శర్మగాని బుజాలు తడుంకోలేదుకదా?' అంటూ రెట్టించుకొంది. నూతిదగ్గిర వరలక్ష్మి మాటలువిన్న శర్మ కంగారుపడి బుజాలు తడుముకోలేదుగానీ ధైర్యంగా

తనలో తను నవ్వుకున్నాడు — నిద్ర మొహం కడుక్కువచ్చి గదిలో పచార్లు సాగించాడు — శకుంతల భావించినట్టు వర లక్ష్మి నిజంగా చెడ్డ మనిషి కాదుగదా? లేకపోతే బొత్తిగా అంత బిడియంలేకుండా మాట్లాడగలదా? శర్మ మస్తిష్కంలో చిన్న అనుమానపు మొలక లేచింది.

ఇల్లు మారివచ్చిన కొత్తలోనే శకుంతల వరలక్ష్మి నైజం పసికట్టేసింది—"ఛ! బొత్తిగా మంచీ మర్యాదా లేని మనిషి. ఏమిటో ఆ విరగబాటు? సంసారి యిళ్ళలో వెధ వ్వేషాలు వేసుకొంటూ..." భార్య విసుగుబాటులో శర్మ కలగజేసుకున్నాడు.

"ఎవరిమీదో ఆ కోపం అంతా?"

"ఇంకెవరు? వుందిగా. పొరుగింటి యిల్లాలు."

"ఎవరూ? మూర్తిగారి భార్యా? వరలక్ష్మి అంటావా...?" శకుంతల మౌనంచూస్తే శర్మకి కుతూహలం కలిగింది—"ఏం ఏమైంది? ఆవిడ ఎలాంటి దేమిటి?"

చురుగ్గా చూసిందిశకుంతల — "మరేం మెచ్చుకో నక్కర్లా; తమ లాంటిదే."

నవ్వాడు శర్మ—"ఛ! ఆడవాళ్లు నాలావుండరుగా?"

"ఎందు కుండరూ? వుండకపోతే మీలాంటి పురుష పుంగవు లెలా తయారౌతున్నారూ?"

"అబ్బ నీ కోపానికేం గానీ అసలేం జరిగిందో చెప్పూ." అప్పటికి మాత్రం శకుంత లేం చెప్పలేదు. శర్మ రెట్టించనూ

లేదు. తర్వాత తనంత తనే చెప్పింది — "ఆవిడ లక్షణాలు చూస్తే నా కేమిటో ఎబ్బెట్టుగా తోస్తోంది. బాబూ! పరాయి మగవాడు కన్పిస్తేచాలు; పగలబడి నవ్వుతుంది. కంఠంపెద్దది చేసి చమత్కారంగా మాట్లాడుతుంది. అలా ప్రవర్తిస్తే చూసేవాళ్ళకి గౌరవం ఏర్పడుతుందా?"

"నే నేమైనా సమర్థించానంటే; నా మీద విరుచుకు పడతావు." అంటూ నవ్వాడు శర్మ.

"అసలు మీ రావిణ్ణి సమర్థించటం దేనికో?"

"అదికాదు శకుంతలా! ఒక్కో మనిషి ఒక్కో రకంగా వుండచ్చు. ప్రతీవిషయానికీ మనం అపార్థం చేసుకోకూడదు. అలా కంఠం ఎత్తి మాట్లాడటంలో నోరారా నవ్వటంలో ఆవిడి కేమీ దురుద్దేశం లేదేమో! కొంతమందిలో వయస్సు పెరుగుతోన్నా మనస్సు పెరగదు. పసితనం పోదు!"

శకుంతల చురచురా చూసింది—"అబ్బ! చాలా కష్టపడి వాదిస్తున్నారే!"

శర్మ చిరునవ్వు నవ్వాడు—"నీ కోపం నామీదేనా?"

"కాకపోతే ఏమిటి? వెర్రిదానికి బోధచేసినట్లు బోధిస్తారేం? సాటి ఆడదాన్ని గురించి అన్యాయంగా మాట్లాడటానికి నే నేం బుద్ధితక్కువ మనిషినా? పోనీ జానకిగురించి ఏమైనా చెప్పానా? ఆవిడ మర్యాదా, గాంభీర్యం ఈవిడ కెక్కడివి? ఉన్నమాట, టన్నానుగానీ వరలక్ష్మి అంటే నాకేం పగా ఏమిటి?"

శర్మ ఏమీ మాట్లాడలేదు.

"మొన్న నేమందో తెలుసా? మధ్యాహ్నంపూట అంతా ఓ దగ్గిర కూర్చున్నాం కబుర్లాడుకొంటూ — మన పాప వరలక్ష్మిని ఎందుకో 'అత్తా!' అని పిలిచింది. ఆవిడ అదోలా నవ్వుతూ – 'నన్నలా పిలవకమ్మా పాపా! పిన్నీ అని పిలు. నాకలాగే బావుంటుంది. ఏదీ? ఎలా పిలుస్తావో వింటాను. ఒక్కసారి పిన్నీ అను.' అంటూ పసిదాన్ని బుజ్జగించి పిన్నీ! పిన్నీ! అనిపించుకొంది – అప్పట్నించీ పాప వరలక్ష్మిని 'పిన్నీ' అనే పిలుస్తోంది."

శర్మకి నవ్వొచ్చింది—"మంచిగొడవే నీతో."

"పిలుపుల్లో ఏముంది అనా ఏమిటి మీ నవ్వూ మీరూను, పిన్ని పిన్ని లాగా వూరుకుంటే బాగానేవుంటుంది- 'బావగారు భోంచేశారా అక్కా?' 'బావగారు నిద్రపోతున్నారా అక్కా' అంటూ అస్తమానూ బావగారి యోగక్షేమాలు ఆరాతీస్తూవుంటుంది. చెప్పద్దూ! ఆవిడ బావగారని పిలుస్తోన్నప్పుడల్లా నాకు ఒళ్లు మండుతూ వుంటుంది. ఏదో అంటే అంటనట్టు జవాబు చెప్తాను. పరాయి మగవాళ్ళతో అన్నచెల్లెళ్ళ వరస పెట్టుకుంటే బావుంటుందిగానీ..."

"ఆవిడమీద నీకింత చెడ్డఅభిప్రాయం వున్నప్పుడు మరి అంత స్నేహంగా ఎలావుండగలుగుతున్నావు? మీ ముగ్గురూ బాగానే మాట్లాడుకొంటూ వుంటారుగా?"

"స్నేహంగా వుండకపోతే తగూ పెట్టుకుంటానా ఏమిటి? మిగిలిన అన్ని విషయాల కీ మనిషి చాలా మంచిది.

మొన్న నోసారి పాపకి జ్వరంవస్తే దగ్గిరకూర్చుని ఎంత చాకిరీ చేసిందనీ? ఇరుగూ పొరుగూ వాళ్ళతో మాటామంచితనం లేకుండా ఎలా బ్రతగ్గలం? మీ రన్నట్టు ఏమిటో పుర్రెకో బుద్ధి - జిహ్వకో రుచీనూ."

"ఆ మాటేగా నేను మొదట్లో అంటే విరుచుకు పడ్డావు."

శర్మతోపాటు శకుంతలకూడా నవ్వేసింది.

ఆ రోజునుంచీ శర్మ వరలక్ష్మి తారసపడ్డప్పు డల్లా విమ ర్శగా **చూస్తూ**నేవున్నాడు. శకుంతల భావించినంత చెడ్డమని షిగా మాత్రం తోచలేదు. **చూసీచూడ**గానే తల ఒంచేసు కొంటుంది. చెడ్డబుద్ధి కలవా ళ్ళెక్కడైనా అలాచేస్తారా?

'ఎంతైనా శకుంతల ఆడదేను. తొందరగా అభి ప్రాయాలు ఏర్పర్చుకుంటారు. వాళ్ళధోరణి మారదు' అను కున్నాడు చాలాసార్లు.

శకుంతల పురిటికి పుట్టింటికి ప్రయాణము పెట్టుకున్న దగ్గర్నుంచీ అప్పుడప్పుడూ తన భయాలు ధ్వనింపజేస్తూనే వుంది మాటల్లో—"ఏమిటో ఈసారి మిమ్మల్ని విడిచివెళ్ళటం బెంగగావుంది నాకు" అంది దిగులుగా **చూస్తూ**.

"ఎందుకూ ? బెంగెందుకూ" అన్నాడు శర్మ విస్మ యంగా.

"ఏమో! ఇక మనం కలుసుకోలేక పోతే ?"

"చాల్లే! అవేం మాటలు?"

"ఏం? అలా జరక్కూడదా? మన యిద్దరిమధ్యా మరే అవాంతరాలూ రాకుండా ఎప్పటిలా వుండగలిగిననాటి మాట కదా?"

శర్మ భార్యకళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూశాడు—శకుంతల తల దించుకొంది – "నీ మనస్సులో ఏముందో తేల్చి చెప్పరాదూ? ఎందుకలా బాధపడతావు?"

శకుంతల మాట్లాడలేదు – మాట్లాడలేక పోయింది. తన మనస్సులో ఏముందో గ్రహించగలిగే మనిషికి ఇంకా ఏం తేల్చి చెప్తుంది? చెప్పి ఏం ప్రయోజనం సాధిస్తుంది?

శర్మ భార్య భుజాలచుట్టూ చేతులువేసి కళ్ళల్లోకి చూస్తూ అనునయించాడు – "ధైర్యంగా వుండు శకూ! పిచ్చి పిచ్చి భయాలు పెట్టుకోకు. నీ కానుపు తేలికే కదూ? నీ ఆరోగ్యం కూడా ఎంతో మంచిది. మూడో నెల తిరిగి వచ్చేసరికి ఎప్పటిలా నిక్షేపంలా యిలాగే వుంటాం. నువ్వే బెంగపెట్టుకుంటే నా మాటేమిటి? ఒంటరిగా ఈ మూడు నెలలూ నే నెంత బాధగా గడపాలో ఆలోచించావా? నువ్వు తిరిగి వచ్చేవరకూ క్షణాలు యుగాలుగా సరీక్షిస్తా నంటే నమ్ముతావా? అదిగో...ఎందు కలా నిర్లక్ష్యంగా చూస్తావు? నేనేం చెప్పినా నువ్వు మనస్ఫూర్తిగా నమ్మవు."

"ఛ! లేదు! ఎందుకు నమ్మను? మిమ్మల్ని కాకపోతే ఇంకెవర్ని నమ్ముతాను?"

"నువ్వు ఆ మాత్రం ధైర్యంతోవుంటే చాలు శకూ!"

శకుంతల కళ్ళలో సంతృప్తి కన్పించింది శర్మకి.

శకుంతల మనస్సులో ఏముందో - ఎవర్నిగూర్చి భయపడిందో శర్మ వూహించలేని విషయం కాదు. కాని 'శకుంతల భయాలు బొత్తిగా నిరాధారమైనవి' అని తనని తనే సమర్థించుకున్నాడు కొన్నాళ్ళవరకూ. శకుంతల వెళ్ళిపోయిన తర్వాత వరలక్ష్మి వీధి అరుగుల మీదగానీ పెరటి దొడ్లోగానీ ఎక్కడ తటస్థపడ్డా పూర్వంలా గిర్రున తిరిగిపోకుండా రెండడుగులు వెనక్కి వేసి నిలబడి – "అక్కయ్య దగ్గిర్నుంచి ఏమైనా వుత్తరాలు వస్తున్నాయాండి? పాప ఏం చేస్తోందిటా? తమ్ముడే కావాలని తెగకబుర్లు చెప్పేది" అంటూ తనంత తను కలగజేసుకుని పల్కరించటం ప్రారంభించింది___ మొదట్లో శర్మ కాస్త కంగారుపడి తల ఎత్తకుండానే జవాబులు చెప్పాడు. ఇంట్లో శకుంతల లేని చికాకుతో ఎక్కడెక్కడో తిరిగి వేళ మించి యింటికి వచ్చేసరికి తరుచూ వరలక్ష్మి యింట్లో తయారైన అల్పాహారాలు మేజామీద ప్రత్యక్షమౌతోంటే శర్మ నొచ్చుకుంటూ రెండు మూడుసార్లు మూర్తితోటి అన్నాడు- "నా గురించి మీరు లేనిపోని శ్రమ తీసుకుంటున్నారు. ఇదంతా అనవసరం కదండీ? నేను హోటల్లో శుభ్రంగా తిని వస్తున్నాను."

మూర్తి మాత్రం జవాబుగా నవ్వి వూరుకున్నాడు. తలుపు దగ్గిరిగా గడపలో నిలబడ్డ వరలక్ష్మి అంది ఓసారి___

"మీకోసం ప్రత్యేకంగా శ్రమేముంది? మాతోపాటే మీకూను. అక్కయ్య వస్తే ఎవరి అవసరమూ లేదు; అంతా ఆవిడే చూసుకొంటుంది."

శర్మ మరేం మాట్లాడలేకపోయాడు. గదిలోకి పోయి కూర్చున్నాడు. పోనీ కృతజ్ఞతలైనా చెప్పుకోలేక పోయానని నొచ్చుకున్నాడు.

ఆ క్షణం వరకూ వరలక్ష్మికి దూరదూరంగానే వుంటు న్నాడు శర్మ. సాయంత్రం నూతిదగ్గిర కబుర్లు వినేవరకూ మూర్తి వూళ్ళోలేని సంగతి తెలీసే తెలీదు శర్మకి — కిటికీ లోంచి తను చూస్తోన్నట్టు తెలిసినా వరలక్ష్మి అంత బట్టవిప్పు కున్నట్టు మాట్లాడటం పగలబడి నవ్వటం. వారవారగా చూడటం, అంతా ఇంద్రజాలంలాగే తోచింది శర్మకి—'వర లక్ష్మి నిజంగా... చెడ్డమనిషేనా ఏమిటి?'

చీకటి పడేవరకూ తెగ ఆలోచించి బుర్ర వేడెక్కించు కున్న శర్మ ఇంటికి తాళం వేసి వీధిలోకి బయల్దేరాడు.

గాలి విసురుకి కిటికీతలుపులు కొట్టు కుంటూంటే వులిక్కిపడి లేచింది వరలక్ష్మి - కుంపటి ఆర్పేసి ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయిన వరలక్ష్మి ఒక్కసారిగా వాతావరణం మారిపోయేసరికి కాస్త విస్తుపోయింది. ఆకాశమంతా చిమ్మ చీకటి అలుముకొంది. అప్పటికప్పుడు చుట్టుముట్టిన మబ్బు లతో నక్షత్రాలకాంతి మరుగున పడిపోయింది. సన్నసన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి. చూస్తున్నంతలోనే వర్షం లోకి దిగింది.

ఎందుకో వరలక్ష్మి హృదయమంతా చాలా ఆవేదనగా వుంది. కిటికీతలుపులు కొట్టుకుంటోన్నా - గాలి వీచినప్పు

డల్లా జల్లు పడుతోన్నా పట్టించుకోలేదు. రెపరెపలాడుతోన్న తెరలకేసి చూస్తూ నిశ్చలంగా కూర్చుంది ఎంతోసేపు.

వర్షపు ధారలకేసి చూస్తోంటే చిత్రమైన ఆవేశం పొంగివచ్చింది వరలక్ష్మికి. చటుక్కున లేచింది. చన్నీళ్లతో స్నానం చేసి వుతికి ఆరవేసుకున్న పువ్వులచీర స్టాండు మీద పడేసి బీరువాలోంచి తెల్లటి ఇస్త్రీ చీర తీసి కట్టుకొంది. అద్దం దువ్వెనా తెచ్చుకుని టేబుల్ ముందు కూర్చుంది—వదులుగా చెవుల మీదికి జుత్తు పడేలా జడ అల్లుకొంది. నచ్చినట్టు లేకపోతే జడివిప్పి చక్రంలా ముడి చుట్టింది. పువ్వులు లేనికొరత కొట్టనస్తోంటే వరలక్ష్మి మొహంనిండా ఉదాసీనత అలుముకుంది. అంతలోనే వుత్సాహంగా లేచి తడి టవల్‌తో మొహం ఒత్తుకుని స్నో రాసి పౌడర్ అద్దుకొంది. కనురెప్పల నిండుగా కాటుక రేఖలు తీర్చుకొంది. కూనిరాగం తీస్తూ పరాకుగా సెంటు సీసా చీరనిండా ఒంపుకొంది. వాతావరణం ఒక్కసారి మొగలి సువాసనలతో గుభాళించింది.

చలాకీగా లేచి కిటికీ దగ్గిరికి వెళ్ళి నిలబడింది. వర్షం కుండపోతగా పడుతోంది. వర్షపుధారల చప్పుడు తప్పితే మరేమీ వినరావటంలేదు. కళ్లు విశాలం చేసుకుని చూసినా రోడ్డు మీద ఏమీ కన్పించటంలేదు.

వరలక్ష్మి వుత్సాహమంతా చచ్చిపోయి నట్టయింది. నెమ్మదిగావచ్చి మంచంమీద దిండుకి ఆనుకుని కూర్చుంది. రకరకాల వికారాలతో మనస్సు అశాంతిమయమైపోయింది. అప్రయత్నంగా కళ్ళలోన నీళ్లు నిలిచాయి—పిచ్చిగాని ఎన్ని రాత్రుళ్లు తనిలా అనుభవరహితంగా గడపలేదు? ఎంత

యౌవ్వన భాగ్యాన్ని వృథా చేసుకోలేదు?— నిస్పృహగా నిట్టూర్చింది వరలక్ష్మి—

ఇంకెన్ని రాత్రుళ్ళు—ఎన్ని నెలలు—ఎన్ని సంవత్సరాలు ఇలా నిష్కామమైన మూగబ్రతుకు బ్రతకాలి ?—తననితను నిలదీసి ప్రశ్నించుకుంది వరలక్ష్మి. తనమీద తనకే అసహ్యం! తన మీద తనకే అభిమానం! ఎవరి మీదో కసి! ప్రపంచం మీదే పగ!— భగవాన్! తను స్త్రీగా యౌవ్వనవతిగా ఏం అనుభవిస్తోంది? తన అదృష్టరేఖ ఎందుకింత కాంతివిహీనమైపోయింది? దుఃఖావేశంతో దిండు మీదికి ఒరిగిపోయింది వరలక్ష్మి.

నిజమే, ఒకటికాదు ... రెండుకాదు. ఏడెనిమిదేళ్ల దాంపత్య జీవితంలో వరలక్ష్మి అనుభూతులన్నీ నిస్సారమైనవే. తల్చుకున్నంత మాత్రాన గుండెలు ఝల్లుమనిపించి కన్నులు అరమోడ్పులై — సిగ్గుతెరలు ముంచుకువచ్చే మధుర స్మృతులేమీలేవు — "మీ ఆయన తెలుగు పండితులటకదూ? మంచి శృంగార పురుషుడై వుంటాడులే" అని పెళ్ళి చూపుల నాడుచమత్కరించిన స్నేహితురాలి మాటలు అస్తమానూ గుర్తు వస్తూనేవుంటాయి వరలక్ష్మికి. నిజానికి శృంగారమంటే ఏమిటో అప్పట్లో వరలక్ష్మి వూహకికూడా అంతు పట్టలేదు. పదిహేడో ఏట పెళ్ళయిన వరలక్ష్మి భర్తనుంచి పెద్దగా ఏమీ తెలుసుకోకుండా అమాయకపు స్థితిలోనే గడిపేసింది రెండు మూడేళ్ళు.

రామ్మూర్తి వయస్సు మళ్ళినవాడుకాడు. రోగిష్టివాడూకాదు. ఎర్రగా సన్నగా రెపటలా వుండే మూర్తిలో

స్త్రీత్వమే తొంగి చూస్తున్నట్టు వుంటుంది. మెత్తటి తల కట్టుతో - నాజూకైన చెంపలతో కోమలంగా కన్పిస్తూంటాడు. పురుషత్వ ప్రకోపం - ఆవేశం - ఉద్రేకం - తొందరపాటు ఏమీ అతని అనుభవానికిరావు - పదిమందీ మాట్లాడుకునే పరిభాషతో - ఒక్కముక్కలో చెప్పాలంటే - వరలక్ష్మి మొగుడు 'సత్తెకాలపుమనిషి.' పెళ్లయిన కొత్తల్లో - వరలక్ష్మి వాంఛలు పుష్కలంగా రేకెత్తని రోజుల్లో - కాలం ఎలా గడిచిపోయిందోగానీ క్రమంగా వరలక్ష్మిలోని స్త్రీత్వం పరిపూర్ణత సాధించింది. జాణతనం రెక్కలువిప్పుకొంది - రామ్మూర్తి మనస్తత్వం కొంతవరకూ అరంచేసుకోగలిగిన వరలక్ష్మి భర్త బలహీనతల్ని సానుభూతితోనే క్షమించింది. భర్త పట్ల వున్న అనురాగంతో అతనిలో వుత్సాహాన్ని రేకెత్తించటానికి శక్తికొద్దీ ప్రయత్నించింది.

అర్ధరాత్రి వరకూ "మేఘసందేశం" పఠిస్తోన్న భర్తని వారిస్తూ చిలిపిగాదీపం తగ్గించేసింది వరలక్ష్మి - "ఏమిటో అంత శ్రధగా చదవటం? ఈసరికి చాలా శృంగారం ఒంటబట్టి వుంటుంది; అవునా?"

"అబ్బ ! ఉండు లక్ష్మీ ! అర్ధాలు రాసుకోవాలి. రేపు పిల్లలకి కొన్ని పద్యాలు చెప్పాలి స్కూల్లో." రామ్మూర్తి తిరిగీ దీపం పెద్దది చేసి పెన్ను తీసుకుని కూర్చున్నాడు. ఒక్క క్షణం అమాయకంగా కన్పించే భర్త మొహం కేసి తదేకంగా చూసిన వరలక్ష్మి చిరునవ్వు నవ్వుతూ అంది - "బడిపిల్లలకిపాఠాలు నేర్పటంతప్పితే ఆ పుస్తకంలో మీ జీవితంకోసం నేర్చుకోవలసిందేమీలేదా ?"

అయోమయంగా చూశాడు మూర్తి — "జీవితానికా? నేర్చుకోవలసిందా? ఏమిటి లక్ష్మి నువ్వనేది?"

వరలక్ష్మి నవ్వింది — "ఆ అర్థాలేవో తొందరగా రాసుకు రండి; నేను పడుకుంటాను." — రామ్మూర్తి అర్థాలు రాసుకు లేచేసరికి వరలక్ష్మి నిద్రపోయింది.

వరలక్ష్మికి పువ్వులంటే తగనిపిచ్చి. అందులోనూ మల్లె పువ్వులంటే మహాయిష్టం. భర్త బజారుకి బయల్దేరేముందు హెచ్చరించినా తరుచూ మూర్తి పువ్వులమాట మర్చిపోతూనే వుంటాడు — ఆ రోజు వరలక్ష్మి కొత్త చీర కట్టుకుంది. కొత్త రకం ముడి చుట్టుకొంది. భర్త తేనున్న పువ్వులపొట్లం కోసం గంపెడాశతో ఎదురుచూస్తూ నించుంది. — భయపడ్డంతా అయింది. — "పువ్వులు తెచ్చారా?" అని ఆతృతగా అడిగితే — "పువ్వులమాటా? మర్చిపోయాను సుమా!" అన్నాడు అతి సామాన్యంగా — వరలక్ష్మి ఓ నిముషం మాట్లాడ లేక పోయింది—రాబోయిన కోపం దిగమింగుకొంటూ నిష్ఠూరంగా అంది — "నాకు పువ్వులంటే యిష్టమని తెలిసికూడా మీ రింత నిర్లక్ష్యంగా ఎలావుండగలరు? పూలఅంగళ్ళ ముందునుండి వస్తూ ఒక్కఅణా పువ్వులు ఇంటికి తీసుకెళ్దా మన్న ధ్యాస రాదుకదూ మీకు?"

"పువ్వులు ఎంచటం సరిగ్గా నాకు తెలీదులక్ష్మి!"

"ఎంచటాని కేముంది? అంగడివాడే యిస్తాడుగా?"

"మగవాళ్ళు పువ్వులు కొనబోతే దగా చెయ్యరూ? వీథిలోకి వస్తాయిగా? బేరంచేసి నువ్వే కొనుక్కో—రాదూ?"

విస్మయంగా చూసింది వరలక్ష్మి – "అణా పువ్వులకి బేరమా ?"

"ఏం ? అణా వుత్తినే వస్తోందా? నీకు డబ్బువిలువ తెలిస్తే అంత తేలిగ్గా మాట్లాడలేవు తెలుసా ?"

వరలక్ష్మి కోపం అవధులు దాటింది – "అవును, నాకు డబ్బు విలువ తెలీదు, తెలీకపోయినా నష్టంలేదు. మీకు మనిషి విలువ తెలీదు. బ్రతుకువిలువే తెలీదు." కళ్ళనిండా నీళ్ళు నిండితే విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

భర్త స్వహస్తాలతో పూలమాల తెచ్చి కురుల్లో అలంకరిస్తే భార్య పరవశిస్తుందన్న సంగతి మూర్తికి ఎందుకు తెలీదు? ఎందుకు...?– అప్పటికైనా మూర్తి మళ్ళా బయల్దేరి బజారు కెళ్ళి ఒక్క అణా పువ్వులు తెచ్చి అందిస్తే వరలక్ష్మి ఎంత ఆనందానుభూతి చెందేదో అతని కేం తెలుసు ?

అంతేకాదు. వరలక్ష్మికి తీరని కోరిలు చాలా వున్నాయి. పిండారబోసినట్లుండే పండు వెన్నెల్లో – పాల సముద్రంలాంటి తెల్లని పానుపుమీద – విష్ణుమూర్తిలా పవ్వళించివున్న భర్త పక్కలో కూర్చుని తను చుట్టిన తమలపాకు చిలకలు భర్త నోటికి అందిస్తూ...సిగ్గుపడుతూ...మన్మథ బాణాల్లాంటి అతని చూపులకి తట్టుకోలేక తల దించేసు కొంటూ...ఉహూ! అసలు భోజనానంతరము తాంబూలం వేసుకునే అలవాటు లేనిమూర్తి, వరలక్ష్మి బలవంతం మీదనే అప్పుడప్పుడూ ఓ అరమోద తమలపాకులు తెస్తూంటాడు. కుంకంపువ్వూ, యాలకుగింజలూ, పచ్చకర్పూరం వగైరాలతో

ఘుమఘుమలాడే వక్కపొడి తయారుచేద్దా మనుకొంది వరలక్ష్మి - ఓ గుప్పెడు వక్కలు మాత్రం తెచ్చి వూరుకున్నాడు మూర్తి. వరలక్ష్మి దాన్నిగురించి మనస్సులో పెట్టుకోకుండా ఆ వక్కలే పొడిచేసి చిన్న డబ్బాలో పోసింది - భోజనాలయ్యాక ఎంగిలి కంచాలు తీసి పీటలు ఎత్తి పెట్టి - అంట్లగిన్నెలన్నీ ఓ వారకి సర్ది వంటిల్లు తుడుచుకువచ్చే సరికి తనే, జ్ఞాపకం వుంటే తమలపాకులకి కాస్త సున్నం పట్టించుకుని నోట కుక్కుకుంటాడు రామ్మూర్తి, "నేను వస్తూ నేవున్నాగా? అంత తొందరెందుకు మీకు? సున్నం అదీ సమంగారాసి నేనివ్వనూ?" అంటూ మందలించిందోసారి వరలక్ష్మి.

"నీ పను లన్నిటితోనూ నువ్వు సతమత మౌతోంటే ఇంకా ఈ శ్రమ నీకెందుకు లెద్దూ!" అన్నాడు మూర్తి భార్యకేసి అభిమానంగా చూస్తూ.

అలాంటి అభిమానమూ వరలక్ష్మి కోరుకునేది? అదోలా నవ్వుతూ అంది - "నాకేం శ్రమలేదు. మీకు నా చేతులతో తాంబూలం అందించటం ఎంతో యిష్టంకూడాను. రేపట్నుంచీ మీకు మాత్రం నేను యిచ్చేవరకూ తమలపాకులు ముట్టకండి. తెలిసిందిగా?" - బెదిరిస్తున్నట్టు చూసింది.

మర్నాటి రాత్రి వంటిల్లు సర్దుకుని తాంబూలం పళ్ళెం తీసుకు వచ్చేసరికి నిద్రపోతున్న భర్తని చూసి హతాశురాలైపోయింది. నెమ్మదిగా పక్కమీద కూర్చుని తమలపాకుల ఈనెలు తీయటం ప్రారంభించింది.

మూర్తికి మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూసి మళ్లా మూసుకున్నాడు. వరలక్ష్మి నవ్వుతూ భర్త మొహం లోకి చూసింది—

"ఇదంతా దొంగనిద్ర కాదుగదా ?" అంటూ చుట్టిన తాంబూలం చేతికి అందిచబోయింది. కళ్ళు తెరుస్తూ "నిజంగానే నిద్రపట్టేసింది లక్ష్మీ!" అంటూ చేయి జాపి తాంబూలం అందుకోబోయాడు మూర్తి. చేతులు ముడుచుకొని, నోటికే అందించాలని పంతం పట్టని భర్తని ఓ క్షణం చూసి తనంత తానుగా తాంబూలం నోటికందించింది. భార్య సిగ్గుపడేలా చిలిపిగా చూస్తూ—కళ్ళతోనే ఆవిడ సౌందర్యాన్ని గ్రోలుతూ— తాంబూలం అందిస్తోన్న వ్రేలు కొరకలేదు మూర్తి— "ఛ! ఏమిటా చిలిపితనం?" అంటూ రుసరుసలాడుతూ కోపం నటించి క్రీకంట చూడాలనుకున్న వరలక్ష్మి చిన్నబోయిన మొహంతో నిర్లిప్తంగా కూర్చుండి పోయింది.

"నిజంగా భోజనానంతరం తాంబూలచర్వణం ఆరోగ్యకరం సుమా!" ఆకాశంలోకి చూస్తూ స్వగతంలా చెప్పుకున్నాడు మూర్తి— "ఏం? నువ్వలా కూర్చున్నావు? తాంబూలం వేసుకోలేదూ?" అన్నాడు భార్యని చూస్తూ. "లేదు. తమలపాకులు లేవు. మీ తాంబూలంలో నాకుకాస్త యివ్వండి" అంది వరలక్ష్మి రాని నవ్వు తెచ్చుకొంటూ—జరిగింది మర్చిపోవటానికి ప్రయత్నిస్తూ / "ఛ లేదానివే, చిన్నప్పుడు అలాగేకదూ ఎంగిలినికూడతీసుకు పంచుకుంటూంటాం. ఛ! అవేమిటో! బొత్తిగా అమాయకమైన రోజులు."

అంటూ నవ్వాడు, మూర్తి—వరలక్ష్మి నవ్వలేక పోయింది. నెమ్మదిగా మూర్తి భార్య చేతిని గుండెలమీదికి తీసుకు న్నాడు—"ఎంత కెంత నిశ్శబ్దంగా వున్నావు? ఏమైనా ఆలో చిస్తున్నావా?"

వరలక్ష్మి కాస్సేపలాగే చూసింది—"ఆలోచించకుండా ఎవరైనా ఉండగలరా? మీరు ఎప్పుడూ ఏం ఆలోచించరా?"

"అవసరంవుంటే ఎందుకు ఆలోచించను?"

"అవసరం! అంటే స్కూలు పిల్లలూ...పాఠాలూ... జీతాలూ మహా అయితే...ఇంటి ఖర్చులూ...బజారు వెచ్చాలూ..."

మూర్తి అదోమాదిరిగా నవ్వాడు—"అవన్నీ ఆలోచిం చదగ్గ విషయాలు కావనేగా నీ వెటకారం? పోనీ నువ్వు చెప్పు ఎలాంటి విషయాలు గురించి ఆలోచించాలో."

వరలక్ష్మి కూడా చిన్నగా నవ్వింది—"ఏదో అన్నానే గానీ మీకన్నా నాకేం తెలుసనీ?" అంటూ నిద్రముంచుకు రాగా పక్క మీదికి ఒరిగింది.

*   *   *

జీవితాన్ని నిర్లక్ష్యంగా త్రోసివేసుకోవటం వరలక్ష్మికి చేతకావటంలేదు. రోజులూ— నెలలూ— సంవత్సరాలూ దొర్లిపోతోన్నకొద్దీ చివరికి తన బ్రతుక్కి ఏమిలాలభించదేమో

నన్న వేదన వరలక్ష్మిని ఆవహించిది. ఒంటరిగా కూర్చుని ఆలోచించుకోటానికి బాగా అలవాటు పడింది.

వరలక్ష్మి వరాలుగా పది పన్నెండేళ్ళ పిల్లగా వున్నప్పుడు వాళ్ళ మేనత్తతోటి ఓసారి పేరంటానికి వెళ్ళింది. పేరంటానికి వెళ్ళటం కొత్త గాకపోయినా అక్కడ జరిగిన విశేషం తల్చుకున్నప్పుడల్లా వరలక్ష్మి నవ్వుకొంటుంది,

"వరాలూ! ఓ మంగళహారతి పాడవే! నీకు బాగా పాటలవీ వచ్చుటకదూ! అందో పేరంటాలు.

వరాలు ఏమంత బ్రతిమాలించుకోకుండానే పాట ప్రారంభించింది– "ఆడబ్రతుకే మధురం! పతి కౌగిటిలో పరవశమయ్యే భార్య బ్రతుకే మధురం! ఆ. ఆ. ఆడ బ్రతుకే" ఫక్కు మన్నారు అంతా ఒక్కసారే... బిత్తర పోయింది వరాలు. పాడటం మానేసి అమాయకంగా చూసింది.

"నీ అమ్మ కడుపు బంగారం గానూ! ఇదేంపాటే! మంగళ హారతి పాడమంటే ఆడబ్రతు కంటూ మొదలు పెట్టావ్." "అయినా అప్పుడే ఈపాటలో అందం నీకేం తెలిసిందే?" "అసలు ఎవరు నేర్పారే నీకా పాట?" అంటూ్లాతలో పక్కా పట్టుకుని ప్రశ్నలువేస్తూ విరగబడి నవ్వారు. వరాలు బిక్క మొహంతోనే చెప్పింది—"మా అత్త...అస్తమానూ ఆపాటే పాడుకొంటుందిగా! అందుకే నేనూ పాడాను."

కాస్సేపు అంతాకలిసి వరాలు మేనత్త సీతారత్నాన్ని హాశ్యాలు పట్టించారు.

సీతారత్నం చాలా అందమైంది. చురుకైంది. ఆవిడ భర్తకూడ అన్ని విధాలా ఆవిడకు తగినవాడేను. వాళ్ళిద్దరి దాంపత్యం చూసేవాళ్ళకి అసూయ కల్గేంత అనుకూలంగా —సుఖంగా—సాగుతుంది. వరాలు చిన్నతనంలో ఎక్కువగా మేనత్తగారింట్లోనే ఉండేది.

సీతారత్నంవాళ్ళ పడగ్గది చాలా అందంగా—స్వర్గ లోకంలాగా వుంటుంది. నగిషీలు చెక్కిన పందిరి మంచానికి గులాబీపువ్వుల పందిరీ- తెల్లటిసిల్కుదోమ తెరా- దాని చుట్టూ రిబ్బన్లకుచ్చులూ- మంచానికి రెండువేపులా పెద్ద పెద్ద అద్దాలూ- పందిరికి వ్రేళ్ళాడుతూ రంగురంగుల పాదరసం గాజుబుడ్లూ- బూరుగుదూది పరుపూ- రంగుదారాల్తో పువ్వులు కుట్టిన తలగడదిళ్ళూ- తెల్లటి పట్టు దుప్పట్లూ... 'అబ్బో! పడుకుని నిద్రపోయే మంచానికి ఎందుకివన్నీనూ?' అనుకునేది వరాలు తర్కించుకొంటూ.

మంచంమాట అలా వుంచి మిగతా గది మాత్రం ఎంత అందంగా వుంటుందనీ?-గది నిండుగా నేల కన్పించకుండా తీగలు పాకుతోన్న తివాచీ-మంచందగ్గిర మేజామీద చన్నీళ్ళతో మట్టికూజా-వెండిగ్లాసూ!

"అత్తా! ఒక్క గ్లాసే పెట్టుకుంటావేం? మరి నువ్వు మంచినీళ్ళు తాగవూ?" కడుపులో మాటకాస్తా అడిగేసిందోసారి వరాలు- సీతారత్నం నవ్వింది-"ఏం? ఒక్క గ్లాసు చాలదేమిటె?"

"ఛీ? మామయ్య తాగిన ఎంగిలిగ్లాసుతో నువ్వు తాగుతావా?" మొహం చిట్లించుకుంది వరాలు.

సీతారత్నం మేనగోడలి బుగ్గ గిల్లింది హాస్యంగా—"లేదే! నేను తాగిన ఎంగిలి నీళ్ళే మామయ్య కిస్తాను."

జాలిగా చూసింది వరాలు. పాపం మామయ్యకూడా అలా తాగుతాడంటే ఏమంత నచ్చలేదు వరాలికి.

అత్తగదిలో కూర్చున్నంత సేపూ ఒళ్ళంతా కళ్ళు చేసుకుని అంగుళం అంగుళమూ చూస్తూనేవుంటుంది వరాలు.

అద్దాల బీరువాకి పక్కగా మరో మేజామీద పూలు పెట్టుకునే గాజుకూజా—అగరొత్తుల చెట్టూ—పన్నీరుబుడ్డీ! సీతారత్నం రోజూ సాయంత్రాలవేళ పెరట్లో పూసేపువ్వులు తెచ్చి కూజాలో సర్దుతుంది. కిటికీతలుపులు మూసి అగరొత్తులు వెలిగిస్తుంది. పన్నీరు బుడ్డిలో రెండు చుక్కలు సెంటు వేసి వుంచుతుంది. తమ ఇంటి పనులు ముగించుకుని స్నానంచేసి ముస్తాబు కుపక్రమిస్తుంది.

గది గోడలనిండా విరహంతో ఒళ్ళు విరుచుకుంటోన్న బొసి బొమ్మలు చూస్తోంటే వరాలుకి అంత చిన్నప్పుడు కూడా సిగ్గు వేసేది—"అత్తా! ఈ బొమ్మ లేంబావున్నాయి? బట్టలవీ లేకుండా...ఛీ! సిగ్గుకాదూ?

ఏంచక్కా—రాములవారి బొమ్మా—బుద్ధుడి బొమ్మా—పార్వతీదేవిబొమ్మా—అలాంటివి పెట్టుకుంటే బావుండదూ? పోనీ గాంధీతాత బొమ్మలు పెట్టుకున్నా బావుంటా

యిగా? అల్లాంటి బొమ్మలే తెమ్మని మామయ్యకి చెప్ప రాదూ?"

సీతారత్నం విరగబడి నవ్వింది ఎంతో సేపు. అంత లోనే మొగుడు వస్తే ఏమిటో చెప్పింది. ఇద్దరూ నవ్వు తోంటే వరాలు తూనీగలా పరిగెత్తింది వీధిలోకి.

ఆ చిన్నతనాన్నంతా వూహించుకొంటూ కూర్చుంటే వరలక్ష్మి కేదో అర్థంకాని ఆవేదన కలుగుతోంది. అత్తచేసే ప్రతీపనిలోనూ ఎంతో అర్థం కన్పిస్తోంది. అత్తలాగే తను కూడా పడగ్గదిని ఎంతో అందంగా అలంకరించుకోవా లన్న కోరికైతే వుంది—ఓసారి భర్తదగ్గిర కూర్చుని మేనత్త యింటిని వర్ణిస్తూ—తన చిన్నతనాన్ని ముచ్చటిస్తూ—మన స్సులో వున్న కుతూహలాన్ని కూడా ధ్వనింప జేసింది. చిట్ట చివరకి నవ్వుతూ అంది—"మా అత్త యిప్పటికైనా తన ముస్తాబు లోనూ యింటి విషయంలోనూ అశ్రద్ధ చెయ్యదు. చిన్న ప్పుడు అన్ని విషయాలు అడిగేదాన్ని కానీ ఇప్పుడు ఏమైనా మాట్లాడాలంటే చచ్చేంత సిగ్గుగా వుంటుంది. మొన్న అత్త మనింటికి వచ్చినప్పుడు ఏమందో చెప్పనా? బయటికి వెళ్ళే మగవాళ్ళని వెనుకనుంచి యిల్లూ యిల్లాలూ అయస్కాంతంలా ఆకర్షిస్తూ వుండాలట. "ఏమే వరాలూ! బొత్తిగా యిలా చెట్టు కింద సామాను పరుచుకున్నట్టు సర్దుకున్నావూ? పడగ్గది అంటూ దీని కేమైనా అంద వుందీ?" అంటూ మందలించింది. నిజమే ననిపించింది నాకూను." — మూర్తి మొహంలో భావాలు వెదకసాగింది వరలక్ష్మి.

"వాళ్ళకీ మనకీ పోలికేమిటి? పల్లెటూళ్ళలో స్వంత యిళ్ళల్లో వుండేవాళ్లు కాబట్టి పడగ్గది అంటూ ఒకటి రహస్యంగా వుంచుకుంటారు—మనకి అన్ని గదులూ ఇదేను; అంత అపురూపంగా వుంచుకోవాలంటే ఎలా వీలౌతుంది?" అన్నాడు రామ్మూర్తి బొత్తిగా వుత్సాహం కనపరచకుండా.

"ఉన్నంతలోనే అందంగా తయారు చేసుకుందాం. నేను చెప్పినవన్నీ తీసుకురండి. తర్వాత మీరేచూస్తారుగా."

మర్నాడు మూర్తి బజారుకి బయల్దేరుతోంటే వరలక్ష్మి చిన్న చీటీ అందించింది—తెరగుడ్డలూ—తెలుపు దుప్పటీ, చిన్ని మట్టికూజా—అగరొత్తుల పెట్టీ - సెంటు సీసా... వగైరా లేవో ఐదారు సరుకులు రాసింది.

"ఇదేమిటి? డబ్బెక్కడి దిప్పుడూ? ఫస్టువచ్చాక చూద్దాం." అన్నాడు రామ్మూర్తి.

'పోనీ అలాగే' అనుకుంది వరలక్ష్మి-ఫస్టు వచ్చింది వెళ్ళింది? రెండో ఫస్టు - మూడో ఫస్టు వచ్చాయి; వెళ్ళాయి. వరలక్ష్మి కోపం దాచుకోలేకపోయింది- "మీకు ఆసక్తి లేని పనిని నేనెలా సాధించగలను? ఒద్దులెండి, ఏమీ తీసుకురావద్దు. ఇందులో బలవంతమేముంది." అంటూ ఆ చీటీ కాస్తా చింపివేసింది మూర్తి ఎదరగానే.

"తెస్తానన్నానుగా? తెస్తానులెద్దూ! అంత కంగారేమిటి?" అన్నాడు మూర్తి టెక్స్టుబుక్కు తెరుస్తూ. వరలక్ష్మి మాట్లాడలేదు. ఓ వారం తిరిగి వచ్చేసరికి వరలక్ష్మి

కోపం తగ్గిపోయింది. తనని తనే వుత్సాహపర్చుకుంది_గది గోడల నిండా వ్రేళ్ళాడుతోన్న పాత ఫోటోలన్నీ తీసేసి మేకులన్నీ వూడలాగింది. పనిమనిషికో పావలాడబ్బులిచ్చి పెట్టెలూ, బుట్టలూ అన్నీ వసారాలో సర్దించింది. గది శుభ్రంగా దులిపించి కడిగి ముగ్గులు పెట్టించింది. కిటికీ క్రిందుగా మంచం వాల్చి తను వుతికి ఆరవేసిన దుప్పట్లు పరిచింది. కాస్త చినుగుపట్టిన సిల్కుచీర ఒకటి వుంటే చించి కిటికీకి, రెండుగుమ్మాలకూ తెరలు కట్టింది. పాత పుస్తకాల పెట్టెల్లో ప్రకృతిదృశ్యాలతో నిండిన కేలండర్లు వుంటే బయటికితీసి రెండు గుమ్మాలకూ ఎదరగా తగిలించింది. గది నిండా సాంబ్రాణిపొగ వేసింది.

మామూలుగా గదిలోకి నడిచివచ్చిన రామ్మూర్తి పడకకుర్చీ యథాస్థానంలో లేకపోతే దృష్టి నాలుగువేపులా తిప్పాడు_"అరే! భలేగవుందే గది... కర్టెన్లెక్కడివి? లక్ష్మీ ఇటురా! నువ్వేకదూ ఇదంతా సర్దావు?"

ముసి ముసిగానవ్వింది వరలక్ష్మి. భోజనాలయ్యాక అంది_ "పోనీ రేపో సెంటుసీసా అగరొత్తులకట్టా తీసుకురండి. మరేం వద్దు."

రామ్మూర్తి గట్టిగా జ్ఞాపకం పెట్టుకుని ఆ రెండూ తెచ్చాడు. వరలక్ష్మి అప్పటికప్పుడు సెంటుసీసా మూత తీసి తన చీరకి కాస్త రాసుకుని మొగుడి బట్టలకి కూడా రాసింది నవ్వుతూ.

"ఇలా ఒంపుకుంటే అదెన్నాళ్ళు ఒస్తుంది? అప్పుడప్పుడూ నువ్వొక్కదానివే రాసుకొంటూ వుండు. చాలు."

అతని మాటలేమంత లక్ష్యపెట్టకుండా అగరొత్తులు వెలిగించటంలో నిమగ్నమైందివరలక్ష్మి- ఇంటి అలంకరణ విషయంలో భర్త ఏమంత ఆసక్తి చూపించకపోయినా వర లక్ష్మి శాయశక్తులా ప్రయత్నిస్తూనే వుంది- ఇంట్లో జాగ్రత్త చేసిన చిల్లరా మల్లరా పెట్టి ఏవేవో కొంటూనే వుంది. కాని ఎన్నాళ్ళిలా నెట్టుకు రాగలదు?- "చూడండి. తలగడా గలీ బుల మీదా- తెరల మీదా చిన్న చిన్న పువ్వులవీ కుడుతాను. సల్లుగుడ్డ బొత్తిగా బోసిగా వుంది. మీ చేతిలో డబ్బువున్నప్పుడు కాసిని రంగుదారాలు తీసుకొస్తారూ?" అంది ఓసారి.

రామ్మూర్తి విసుగ్గా చూశాడు- "ఎందుకొచ్చిన ఖర్చులో అవన్నీ? కడుపునిండాలా? పాడా?"

వరలక్ష్మి తెమ్మని పురమాయిస్తోన్న సరకు లన్నీ వుత్తఅనవసరం అని ఎన్నాళ్ళగానో అనుకొంటూనే వున్నాడు. బొత్తిగా కాదంటే వరలక్ష్మికి కోపం వస్తుందేమోనని రెండు మూడు నెలలవరకూ సెంటు సీసాలూ- అగరొత్తుల కట్టలూ వగైరాలు కొన్నాడు. "తిండిఖర్చు కన్నా ఈ చిల్లర ఖర్చే ఎక్కువౌతోంది." అని వరలక్ష్మి వినేలాగే నాలుగైదు సార్లు అన్నాడు. అయినా ఆవిడ తన ధోరణి మార్చుకోలేదు. అలాగే నిలబడి వున్న వరలక్ష్మి ఎలాంటి చికాకూ కన్పించ నీయకుండా అంది- "కడుపు నింపుకోవటం ఒక్కటేనా మన లక్ష్యం?"

రామ్మూర్తి విసుగ్గా అన్నాడు.- "బ్రతకాలంటే కడుపు నింపాలో అక్కర్లేదో నీకు తెలీదా?"

"ఎందుకు తెలీదు? సుఖం దుఃఖం లేని. ముఠకి బ్రతుకు బ్రతక్క పోతేనేం?" దుసుసు గానే అంది వరలక్ష్మి. రామ్మూర్తి మళ్ళా మాట్లాడలేదు. అతను గంటల తరబడీ తర్కించి కేకలేసినా బావుండుననిపిస్తుంది వరలక్ష్మికి. 'మగ వాళ్ళలో ఇంత అమాయకులు వుంటారా? అది అమాయకత్వం అని మాత్రం ఎలా అనుకోవటం? బి. ఏ. చదివిన వ్యక్తికి కనీసపు లోకజ్ఞానంకూడా లేక పోవటం ఏమిటి నాఖర్మగాకపోతే...' తన ఖర్మనే నిందించుకోవాలనిపిస్తుంది వరలక్ష్మికి.

* * *

వరలక్ష్మికి అనుభవాల్లో విచిత్రమైనవికూడావున్నాయి. అవి రామ్మూర్తి మనస్తత్వానికి మచ్చుతునకలు కావచ్చు.

స్నానం చేసి తడిఒంటినిండా పల్చటి గుడ్డ చుట్టుకుని గబగబా గదిలోకి వెళ్ళిపోయింది వరలక్ష్మి. రామ్మూర్తి పరాకుగా కాయితాల కోసం గదిలోకి వెళ్ళబోయాడు. వెనక్కి తిరిగి **చూ**సింది వరలక్ష్మి. చీర తీసి ఒంటినిండా కప్పుకొంటూ లేనికోపం నటిస్తూ అంది— "ఏమిటా సిగ్గులేనితనం? బట్టకట్టుకుంటున్నానని తెలీదూ? చాలుగాని కాస్సేపటివరకూ లోపలికి రాకండి."

తప్పు చేసినవాడిలా వెనక్కి తగ్గాడు రామ్మూర్తి. "నిజంగా నువ్వు గదిలోనికి వచ్చినట్టు నాకు తెలీనే తెలీదు" అన్నాడు. వరలక్ష్మి చీర అంచులు సరిజేసుకొంటూ కూర్చుంది మంచంమీాద. ఏడెనిమిది నిముషాలు గడిచింది.

"లక్ష్మీ! రావచ్చునా?"–ఆడవాళ్ళు బట్ట కట్టుకొంటోంటే మొగవాళ్ళు లోపలికి వెళ్ళకూడదన్న సూత్రం మూర్తికిబాగా తెలుసు – నియమబద్ధంగా ప్రతికేవ్యక్తి మూర్తి–"ఏమిటాకంగారు? చీరకట్టుకోటం అయితే యిక్కడెందుకు కూర్చుంటాను?" విసుక్కొందివరలక్ష్మి.

మరో ఐదు నిముషాలు గడిచాయి.

"అబ్బ ఎంత సేపు నీ సింగారం? డెస్కులో కాయితాలున్నాయి. పోనీ అవ్వయినా యిలా పడెయ్."

"అవేమిటో నాకు తెలీవు. అంతకంగారైతే వచ్చి తీసుకోండి."

"బావుంది, రావద్దన్నావుగా?"

"అంటే మాత్రం మీరెందుకు మానాలి?"

"అన్ని మాటలూ నీవేనా? ఇంతకీ చీరకట్టుకోటం అయిందో లేదో చెప్పూ?"

వరలక్ష్మికి నవ్వూ ఏడుపూ కలిసి వచ్చాయి. కంఠం పెగుల్చుకుంటూఅంది–"అసలు నేనిప్పుడుచీర కట్టుకోను. ఏం? మీరొక్కరేగా యింట్లో వున్నదీ? నేను కట్టుకోకపోతే మాత్రం తప్పేముందీ?"

భార్య అంటోన్న మాటలగురించి రామ్మూర్తి ఏమంత ఆలోచించలేదు. మరో నిముషం ఆగి గదిలోకి వెళ్ళేసరికి వరలక్ష్మి చీర కట్టుకుని తల దువ్వుకొంటుంది. "బుష్షర్టులంగు

డంటూ ఓ మగవాడున్నాడంటే యింతకాలం నేను నమ్మ లేదు"

"స్కూలుకి లైమవుతోంది. ఇన్‌స్పెక్షన్ వుందీపూట" కాయితాలు తీసుకుని హడావుడిగా వెళ్ళిపోయాడు మూర్తి.

వరలక్ష్మి కన్నీరాలై కూర్చుంది. మునివేళ్ళతో కన్నీళ్ళు విదిలించివేసుకొంది.

*　*　*

కారుచీకటి — కీకారణ్యం — కీచురాళ్ళ రొద —: ఉండి ఉండి ఒక్కో క్రూరమృగం గర్జన ఆ భయంకర వాతావర ణంలో బోయీల వూతపదాల వెంట మేనా ప్రయాణం — మేనాలో కొత్త పెళ్ళి కూతురై తలదించుకు సిగ్గుపడుతూ కూర్చుంది. వరలక్ష్మి — వరలక్ష్మి వూహాల్లో ఎక్కడో ఓ మహాపురుషుడు!

హఠాత్తుగా ఆగిపోయింది మేనా, చుట్టూ కలవరం! ఒక్కవూపుతో తెరుచుకున్నాయి మేనా తలుపులు. రెక్క పట్టి లాగిన విసురుతో వరలక్ష్మి వెళ్ళి ఆ బందిపోటు గుండెల మీద పడింది—భయంతో కెవ్వున కేక వేసింది. విదిలించు కోవాలని గిలగిల్లాడింది. ఆ ధృఢమైన హస్తాల మధ్యనుంచీ బయటపడటము తనకు శక్యంకాలేదు. ఆ చేతులు బలంగా వర లక్ష్మిచుట్టూ బిగుసుకున్నాయి. వరలక్ష్మి శరీరమంతా తియ్యని బాధతో వేగిపోయింది—సంతోషమో దుఃఖమో తెలీని

కన్నీరు పొంగివచ్చింది. బెదిరిన లేడిలా ఆ పురుషుడి వక్షస్థలానికి అంటిపెట్టుకుపోయింది.

"లక్ష్మీ!...లక్ష్మీ...! ఏమిటలా వులిక్కిపడ్డావు?" తట్టి లేపిన మొగుడి మొహంలోకి వెర్రిదానిలా చూసింది వరలక్ష్మి.

"ఏమిటి? ఏమైంది?"

"కల...కల...ఎవడో దొంగ. గట్టిగా...నన్ను...కదలనివ్వకుండా...

"భలేదానివే! కలల కేమిటి? లక్షాతొంభై వస్తాయి, పోతాయి."

అంత మధురమైన కల...నిజంకాదు...నిజమైన జీవితంలో...మధురిమ లేదు.

తపనగా భర్త గుండెల్లో మొహం దాచుకోబోయింది వరలక్ష్మి. రామ్మూర్తి అయిష్టం వ్యక్తపరిచాడు — "కల భాగ్యానికే ఏంభయం లక్ష్మీ? అసలే ఉక్కగా వుంది. నాకు సరిగ్గా నిద్రపట్టదు." కొంచెం ఒత్తిగిలి పడుకున్నాడు. వరలక్ష్మి ఎంతోసేపు జీవచ్ఛవంలా అచేతనంగా వుండిపోయింది. దుఃఖం పొంగి రాబోతే కొంగు నోట కుక్కుకుంది—ఛీ! తను ఎందుకు బ్రతుకుతోంది? ఈ నికృష్టపు జీవితంలో ఏం అనుభవిస్తోంది?

వరలక్ష్మి కళ్ళుమూతపడలేదు—వివాహమైనదాదిగా తను పొందుతోన్న సుఖం ఎంత అల్పమైనదో తనకు తెలుసు. భర్త కోరికలో అతని సుఖం అతని స్వార్థం తప్పితే వారేమీ

లేవు. తన సుఖంగురించీ తనతృప్తి గురించీ భర్త ఎన్నడూ ప్రశ్నించలేదు. తను చెప్పనూలేదు. తన సంతోషంకోసం అత నేమీ ప్రయత్నించలేదు. ఏం చేస్తే తమ దాంపత్యం అన్యోన్యంగా వుంటుందో అతను ఆలోచించలేదు. జీవితంలో భర్తగా తనకి కొన్ని బాధ్యతలు వున్నాయని అతనికి తెలీదు. అవి నిర్వర్తించలేని అశక్తతని ఆతని అంతరాత్మ అపహసించదు—ఇక ఏవిధంగా రామ్మూర్తి భార్యని సంతోషపెట్టగలడు?

వరలక్ష్మిలో కోరికలు రెక్కలువిప్పుకు ఎగిరేస్థితిలో వున్నాయని ఆ కల వచ్చేవరకూ వరలక్ష్మికే తెలీదు. ఆ రోజునుంచీ వరలక్ష్మి మొగుణ్ణి పరాయి మగవాళ్ళతో పోల్చి చూడటం నేర్చుకుంది—ముక్కూ మొహం తెలీని మగవాళ్ళని గురించి గంటల తరబడీ ఆలోచించటం అలవాటు చేసుకుంది—బందిపోటుదొంగ బలవంతంగా గుండెలకదుముకున్న కలని వద్దనుకుంటూనే మాటిమాటికీ గుర్తు తెచ్చుకుంటుంది. నిజంగా తన జీవితంలో అలా జరిగితే? ఛీ! తాను ఒప్పుకుంటుందా? కలలో ఎందుకలా వుండిపోయిందోగానీ నిజంగా జరిగితే ఛెళ్ళున చెంపపెట్టు పెట్టదూ? ఒక్క విదుపుతో వదిలించుకు బయట పడదూ? ... నిజంగా...నిజంగా...అలా చెయ్యగలదా తను? అంత బలిష్టమైన హస్తాలనుంచి...అంత మధురమైన అనుభవంనుంచి...తనెలాబయటపడుతుంది? తన వశం ఎలా అవుతుంది? అబల...! ఆ పురుష హస్తాల మధ్య చిక్కినలిగిపోక తనేం చెయ్యగలుగుతుంది? అంతా భ్రమ! ఏమీ చెయ్యలేదు .... అటువంటి బలవంతపు అనుభవముకోసమా

తను నిరీక్షిస్తోంది? — తను ఏమిటో తనకే అర్థంకాలేదు వర లక్ష్మికి. తెరలు తెరలుగా దుఃఖం కట్టలు తెంచుకు వచ్చింది.

*　　*　　*

శర్మని చూసిన క్షణం త్రుళ్ళిపడింది వరలక్ష్మి.

నల్లగా పోత విగ్రహంలా బలిష్టంగా నిలువెత్తు మనిషి పక్కవాటాలో అద్దెకుదిగిన శర్మ—ఎవరికేసి చూసినా దీర్ఘంగా సూటిగా గుచ్చిగుచ్చి చూస్తాడు శర్మ. అతని పెదవులమీద మెరిసే చిరునవ్వు మొహాన్నంతా కాంతివంతంచేస్తూంటుంది—ఒకటి రెండుసార్లు శర్మ చూపులకి తల తిప్పుకోకుండా తనూ తదేకంగా చూసింది వరలక్ష్మి — తనని జబర్దస్తీగా గుండెలకి అదుముకున్న గజదొంగ—మర్చిపోవాలన్నా తనకు మరుపురాని ఆ ఘరానా దొంగ..ఇతను..ఇతను...కాదుగదా?

నాలుగైదు రోజుల తర్వాత శకుంతల వచ్చింది అద్దె వాటాలోకి — క్రమంగా జానకీ వరలక్ష్మి శకుంతలా బాగానే స్నేహ మయ్యారు.

శకుంతల తెల్లగా అందంగా బొమ్మలా వుంటుంది; నిత్యం ఏవోరకం పువ్వులు పెట్టుకుంటుంది. తరుచూ మొగు డితో కలిసి షికార్లకీ సినిమాలకీ వెళ్తుంది. అతను ఆఫీసు నుంచి యింటికి వచ్చాకా — సెలవు రోజుల్లోనూ—ఇంట్లోంచి బయటికే రాదు. ఇద్దరూ గదిలో కూర్చుని చదరంగమో కేరమ్సో ఏవో ఆడుకుంటూ వుంటారు. ఏవో పుస్తకాలు చదువుకుంటారు. గంటలతరబడీ కబుర్లు చెప్పుకుంటారు—

ఓరోజు మధ్యాన్నంపూట వరలక్ష్మి శకుంతల దగ్గిరికి వెళ్ళింది — మాటల మధ్య మనస్సులో మాటకాస్తా జార విడిచేసింది — "నువ్వు చాలా అదృష్టవంతురాలి వక్కా!" అంది అదోమాదిరిగా నవ్వుతూ.

శకుంతల ప్రశ్నార్థకంగా చూసింది — "ఏం? ఎందు కలా అన్నావు వరలక్ష్మీ" అంది.

వరలక్ష్మి మాట్లాడకపోతే మరోసారి రెట్టించింది.

"ఏమో! నా కలా అనాలనిపించింది. అనేశాను. పోనీ గానీ ఏదైనా పుస్తకం యిద్దూ! బొత్తిగా తోచటంలేదు." అంటూ మాట మార్చింది.

శకుంతలకూడా మరేమీ తర్కించకుండా పరుపుకింద దాచిన పుస్తకం బయటికి తీస్తూ అంది—"ఈ పుస్తకం చదివి చూడు, నీకు నచ్చుతుందేమో!"

వరలక్ష్మి ఆ పుస్తకం చివరంటా తిరగవేస్తూ ఆశ్చర్యం వెల్లడించింది — "ఇదేం పుస్తకం? ఇలాంటి పుస్తకాలు నే నెప్పుడూ చూడలేదే! నీ కెక్కడి దీ పుస్తకం?"

"ఇంకెక్కడిది? (శ్రీ) వారి సరదాలే అవన్నీనూ. నెలనెలా ఈ పత్రిక తెస్తూఉంటారు. ఆయన చదవటం కాకుండా నేనూ చదివేవరకూ ప్రాణాలు తీస్తారు. చెప్పద్దూ? ఈ పుస్త కాలు చదవటమంటే నాకూ చాలా యిష్టమేను. దాంపత్య జీవితాన్ని గురించి ఎన్ని విషయాలు తెలుసుకోవచ్చు నను కున్నావూ? నే చెప్పటం దేనికీ, చదివి చూడు. నీకే తెలు స్తుంది. పాత పత్రికలుకూడా యిస్తాను."— శకుంతల ఆ

పుస్తకాల గురించి ఏమేమో చెప్తోంటే మంత్రముగ్ధలా వింది వరలక్ష్మి - ఇంట్లోకివచ్చి పక్కమీద పడుకుని కుతూహలంగా పుస్తకాన్ని తిరగవేసి చాలావరకు చదివింది - నిజంగా తామెంత గుడ్డిగా కళ్ళుమూసుకు బ్రతుకులు వెళ్ళదీస్తున్నారో అర్థమైంది. అసలు జీవితం అంటే తనకిగానీ తన భర్తకిగానీ ఏం తెలుసు? దంపతులు విధిగా తెలుసుకోవాల్సిన శాస్త్రం ఎంత ఉందనీ!

నట్టనడి సముద్రంలో కొట్టుకుపోతున్న దౌర్భాగ్యుడికి అందమైన పూలపడవ దొరికినంత సంతోషం కల్గింది వరలక్ష్మికి- తన భర్తని ఆవరించుకొన్న జడత్వానికి కారణం తెలిసింది. మనిషి పుట్టగానే ఎలా విజ్ఞానవంతుడు కాలేడో అలాగే సరసుడూ కాలేడు. ఆయన తెలుసుకోవలసిందీ నేర్చుకోవలసిందీ ఎంతైనా వుంది. ఇటువంటి శాస్త్రగ్రంథాలు కొన్నాళ్ళపాటు చదివితే దాంపత్య ధర్మాలూ - స్త్రీ వాంఛలూ-సంతృప్తి సుఖాలూ - అన్నీ అర్థం ఔతాయి.

భోజనాలై గదిలోకి వచ్చేవరకూ వరలక్ష్మి ఆలోచిస్తూనే వుంది. రామ్మూర్తి మరేదో కార్యక్రమానికి వుపక్రమించబోతే నెమ్మదిగా దగ్గిర కూర్చుంది. పుస్తకాలన్నీ ఎదర పెట్టి.

"ఇవి నీ కెక్కడివి ?" ఆశ్చర్యంగా అడిగాడు రామ్మూర్తి.

అంతా చెప్పింది వరలక్ష్మి - "నిజంగా వాటిని చూస్తోంటే మనం పసిపిల్లలమేమో అనిపిస్తోంది. సంసారం

గురించి మనకు తెలిసిందెంత? అసలు మనం అనుభవిస్తోం దేమిటి? మీరు యివన్నీ ఒక్కసారి చదివిచూడండి. తర్వాత మనంకూడా ఈ పత్రిక తెప్పించుకుందాం."

రామ్మూర్తి ఓ సారి పుస్తకాలన్నీ తిరగవేశాడు. భార్య మొహంలోకి చూసి నవ్వుతూ అన్నాడు-"శాస్త్రాలు చదివి కాపరాలు చేస్తే ఎలకపిల్లలు పుట్టాయట. పిచ్చికాకపోతే మొగుడూ పెళ్ళాల సంగతులు ఒకళ్లు చెప్పే దేమిటి?"

"అలా అనకండి. లోకజ్ఞానం వేరు. శాస్త్రజ్ఞానం వేరు. మన బలహీనత లేమిటో మనకు తెలీటంలేదు. మన శరీరనిర్మాణ మెటువంటిదో మనకు అర్థం కాదు-నా కోరికలు మీకు తెలియవు. మీ మన స్తత్వం నాకు బోధపడదు. మీరు డబ్బు తెస్తున్నారు. నేను వండిపెడుతున్నాను. భార్యాభర్తలం అనుకొంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నాం. కాని మన అనుభవాలెంత రసవిహీనమైనవో మీకన్నా ఎక్కువ నాకు తెలుసు. కనీసం ఈ విధంగా శాస్త్రపరిజ్ఞానంతోనైనా మన లోపాలు తెలుసుకుని భవిష్యత్తునైనా సుఖమయం చేసుకోవటానికి ప్రయత్నించ కూడదా? అవి చదవటంవల్ల ప్రయోజనం వుంటుందిగానీ మన మేం నష్టపోముగా?" వరలక్ష్మి అనునయంగా భర్త కళ్ళలోకి చూస్తూ మాట్లాడింది.

రామ్మూర్తి పెన్ను చేతిలోకి తీసుకొంటూ అన్నాడు-"సరేలే. శెలవునాడు జ్ఞాపకం చెయ్యి; చదువుతాను. ఇప్పుడు నేను కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుకోవాలి." ప్రాణపడిపోయింది వరలక్ష్మి — అచేతనంగా కూర్చుంది. శకుంతల మళ్ళా కొత్తపత్రిక యివ్వబోతే అదో మాదిరిగా

నవ్వుతూ అంది — "వద్దులే అక్కయ్యా! అవి చదివి నా మెదడు వేడెక్కించుకోవటం తప్పితే ప్రయోజనం లేదు. మా వారికి ఈ పుస్తకాలంటే ఏమంత ఆశక్తి లేదు." నట్టనడి సముద్రంలో తేలివచ్చిన పూలపడవ చేతికందకుండా మాయమైంది.

రయ్యిమంటూ కిటికీలోంచి వచ్చింది చలిగాలి. అప్రయత్నంగానే వరలక్ష్మి పైటకొంగు ఒంటినిండా కప్పుకొంది. ఆలోచనా వలయాలు చెల్లాచెదరయ్యాయి.

కడుపులో ఆకలిబాధ దహిస్తోంది. టేబుల్ మీంది గడియారం ఒంటిగంటపైగా చూపిస్తోంది.

విరక్తిగా—దీర్ఘంగా నిట్టూర్చింది వరలక్ష్మి.

ఆగిన వర్షం తిరిగీ కుండపోతగా కురియసాగింది.

హోరుమంటూ వానచప్పుడు వినవస్తోంది.

వరలక్ష్మి మోకాళ్ళమీద గడ్డం ఆన్చుకుని కూర్చుంది—తలుపులు తెరిచి మూసుకున్నాయి.

తలెత్తి చూస్తూ త్రుళ్ళిపడింది. దిగ్గున మంచం దిగి నిలబడిపోయింది వరలక్ష్మి.

శర్మ ధరించిన గ్లాస్కోలాల్చీ సిల్కు పైజమాలమీద నుంచి సెంటువాసన గుప్పుమంటూ వీచింది. నున్నగాదువ్విన జుత్తునొక్కులు దీపపు కాంతిలో మెల్లుమెల్లుగా మెరిశాయి. మొహమంతా ఎన్నడూ చూడని నవ్వుతో వింతగా కన్పిస్తోంది. నుదుటిమీద చెమటబొట్లు నిలిచివున్నాయి. అతను

గాలిపీల్చి విడుస్తున్న శబ్దాలు బలంగా వినవస్తున్నాయి. చేతిలోవున్న తెల్లటి రుమాలువిప్పి బారెడు మల్లెపువ్వుల మాల బయటికి తీశాడు.

చిత్తరువులా బిగుసుకుపోయిన వరలక్ష్మి కాస్త చలనం తెచ్చుకుంది. ఆమె మొహంనిండా సంభ్రమం అలుము కొంది....శర్మ....తమ గదిలోకి రావటం....భర్త లేనిసమ యంలో...అర్ధరాత్రి....ఇలా జొరబడటం....ఎంత విచిత్రంగా వుందో అంత సహజంగానూ వుంది—వరలక్ష్మికి. సాయంత్రం నూతిదగ్గిర జానకితో శర్మ వింటాడనే ఎన్నోమాటలు మాట్లా డింది. అవన్నీ విన్న శర్మ తనదగ్గిరికి రాకూడదూ? అనికూడా ఆలోచించుకొంది వెకిలిదానిలాగా.

తను గతం తవ్వుకొంటూకూర్చుంది. మనసంతా ఏదో విషాదం. అర్ధరాత్రి నిశ్శబ్దం ఆవరించుకున్నాయి. శర్మ...నిజంగా...రానే వచ్చాడు — వరలక్ష్మి సంభ్రమం చాలావరకు తగ్గిపోయింది.

రెండడుగులు ముందుకు వేశాడు శర్మ. వరలక్ష్మి సిగ్గు పడుతోన్నదానిలా తలదించుకొంది. శర్మ నవ్వుతూ చూశాడు — పూలమాల అందించబోతూ అన్నాడు—

"మీరు పువ్వులు కావాలన్నారు కదూ?"

ఆ కంఠధ్వని వరలక్ష్మి కర్ణపుటాలలో నృత్యం చేసింది. వారగా చూస్తూ అంది—"మిమ్మల్ని తెమ్మనలేదుగా?"

శర్మ మరో అడుగు ముందుకు వేశాడు — "మీకు మల్లెపువ్వులంటే చాలా యిష్టంకదూ!"

"నాకు వున్న యిష్టాలన్నీ మీరు తీర్చగలరా?"

నవ్వాడు శర్మ, చక్రంలా అందంగా వున్న వరలక్ష్మి జుత్తు ముడిమీద పడేలాగా మల్లెపూల దండ విసిరాడు. సిగ్గుతో చితికిపోయింది వరలక్ష్మి. మెడమీదుగా వ్రేళ్ళాడుతోన్న మాలని మునివేళ్ళతో సర్దుకొంది.

"వరలక్ష్మీ!" – శర్మ వూపిరి సెగలా తాకింది, వరలక్ష్మి చెంపని – ఆందోళనగా వెర్రిగా చూసింది వరలక్ష్మి– శర్మ మొహమంతా జేవురించినట్టుంది. అతని కళ్ళ చూపులు ములుకుల్లా గుచ్చుతున్నాయి.

"మీరు...మీరు...ఎందుకిలా వచ్చారు?" వరలక్ష్మి కంఠం ఒకంతట పెగిలి రాలేదు– శర్మ తపనగా చూశాడు– "నీకు తెలీకే అడుగుతున్నావా?" శర్మ చేతులు రెండూ వరలక్ష్మి భుజాలు చుట్టబోయాయి. బెదిరిన లేడిలా తప్పించుకొంది వరలక్ష్మి– "ఏమిటిది ?... మా గదిలోకి మీరు రావటం...ఛీ ! ఎంతతప్పు!"

నిర్లక్ష్యంగా ధ్వనించింది శర్మ నవ్వు– "మీ ఆడవాళ్ళ చమత్కారాలు నాకు కొత్తకాదులే. ఇప్పుడు నేనేం తప్పు చేశానో?" చిలిపిగా అన్నాడు శర్మ.

వరలక్ష్మి చిత్రంగా చూసింది– "ఇప్పుడు మీరు చేస్తున్నది తప్పు కాదూ? మగవాళ్ళు లేని ఇంట్లో జొరబడి పరాయి ఆడవాళ్ళకి పువ్వులు అందించటం... గడుసుతనం కాదూ?"

"నా పొరపా టేమీ లేదే! అది నీ గ్రహచారం అనుకుంటా నన్నావుగా ?" నవ్వాడు శర్మ. దెబ్బతిన్నట్టు చూసిందివరలక్ష్మి. మృదువుగా అన్నాడు శర్మ.

"నేను తప్పు చేశానా వరలక్ష్మీ? ఈ మాట నువ్వు మనస్ఫూర్తిగా అంటున్నావా? నాకు వినిపించేలా సాయంత్రం ఎందుకలా మాట్లాడావు? మీ ఆయన లేకుండా ఎందుకింత ముస్తాబు చేసుకున్నావు? ఆకాశం చిల్లినట్టు వర్షం పడుతోంటే తలుపు లెందుకు తీసివుంచావు? వీటి అర్థాలన్నీ నేను గ్రహించాలనికాదా నీ వుద్దేశ్యం? పైగా నేనే తప్పు చేస్తున్నాననటం నీ జాణతనం కాదూ?"

శర్మ నవ్వుతోంటే వరలక్ష్మి కుంచించుకు పోయింది. తనని దోషిగా నిలబెట్టి అపహాస్యం చేస్తున్నట్టు సిగ్గుపడి పోయింది.

"నీకు నిజంగా కోపం వచ్చిందేమిటి" శర్మ వరలక్ష్మి పైటకొంగు అందుకున్నాడు.

వరలక్ష్మి చెంగు లాక్కుంది; మూతి ముడుచుకుంది.

"అబ్బో నిజంగానే కోపం వచ్చిందే! ఆలశ్యంగా వచ్చాననా?"

"చాల్లెండి, మీ కోసం ఇక్కడెవరూ ఎదురు చూడ లేదు."

"మరెవరికోసం? ఎవరైతేనేం? మీ ఆయన లేడుగా?"

చురుగ్గా చూసింది వరలక్ష్మి- "మీరు లేనప్పుడు మీ ఆవిడ అంతే చేస్తుంది కాబోలు." ఆవేశం అణచు కొంటూ అంది.

ఎర్రబడింది శర్మ మొహం. అతిశయంగా విన్పించింది అతని నవ్వు- "నా భార్య కేం ఖర్మ వరలక్ష్మి?"

"ఎవరికి మాత్రం ఏం ఖర్మ? మీ భార్య తప్పితే మరెవరూ సంసార్లు కారనా ఇంత తెగించారు?"

"సంసారం!" శర్మ వరలక్ష్మి మొహంలోకి గుచ్చి గుచ్చి చూశాడు- "సంసారం అంటే తెలిసిన నీ కళ్ళలో ఎందుకంత కోరిక? సంసారం చేస్తోన్న నీలో ఎందు కంత విరక్తి?"

మాటలురాని మూగవ్యక్తిలా వెర్రిగా చూసింది వరలక్ష్మి

"చెప్పవేం వరలక్ష్మి? బెట్టు చెయ్యటానికే ఈతర్కం లోకి దిగావుకదూ?- నీ గురించి నాకు అంతా తెలుసు. జీవితంలో నీకు నిజమైన సుఖంలేదు. నిన్ను చూసిన క్షణంలోనే నే నా రహస్యం అర్థం చేసున్నాను. నీలాంటి దౌర్భాగ్యులంటే నిజంగా నాకెంతో జాలి. నేను నీ శ్రేయస్సు కోరే వ్యక్తినని నువ్వు నమ్మితే నాకుచాలు వరలక్ష్మీ!"

వరలక్ష్మి ఖిన్నురాలై నిల్చుంది. శర్మ మృదువుగా వరలక్ష్మి భుజంమీాద చెయ్యి వేశాడు. నెమ్మదిగా శర్మ చేతిని త్రోసివేసింది. వరలక్ష్మి- "ఇటు నా భర్తకీ అటు

మీా భార్యకీ అన్యాయం చేసి మనం అనుభవించబోయేదేమీా లేదు. దయచేసి మీారు..."

"వెళ్ళిపొమ్మంటావ్. అంతేగా?" దించుకున్న వరలక్ష్మి మొహంలోకి చూడ ప్రయత్నిస్తూ నవ్వాడు శర్మ–"నీమనస్సు భీతితో చలిస్తూండవచ్చు; కాదనను వరలక్ష్మీ! కాని తన్ను మించిన ధర్మం మంచి దంటావా? నేను మగవాడిని. నేనేం చేసినా సంఘం సమర్ధిస్తుంది. నా భార్య కూడా నా కోరిక అర్ధం చేసుకుంటుంది. అంగీకరిస్తుంది ఇక నే నావిడకు అన్యాయం చేస్తున్నానన్న ప్రస్తావనేలేదుగా. పోతే నీ మాట. నువ్వు ఏవేవో ధర్మ పన్నాలు వల్లెవేసుకోవటం వివేకం కాదు. అసలు నిన్నే నీ భర్త అన్యాయం చేస్తున్నాడు. పగ తీర్చుకోవటానికి కాకపోయినా నువ్వు సుఖపడాలనే స్వార్ధమైనా నీకు వుండాలి వరలక్ష్మీ! మనమంతా ఈ ప్రపంచంలో పుట్టింది సుఖపడటానికి గాని కుళ్ళి కుళ్ళి ఏడవటానికి అంటావా? నీతి నియమాలకి ఓ హద్దంటూ ఎక్కడుందీ? ఎన్ని కుటుంబాలలో ఎన్ని తతంగాలు జరిగిపోతున్నాయో ఎవరికి తెలుస్తోంది? మగవాడిలా సుఖపడటానికి ఆడదానికి మాత్రం హక్కులేదూ? ఆడది మాత్రం రక్తమాంసాలతో నిండు ప్రాణాలతో బ్రతుకుతోన్న వ్యక్తి కాదూ? మానవత్వం వున్న ఏ మనిషి ఈ నిజాన్ని కాదనలేడు వరలక్ష్మీ! నా మాట నమ్ము. నువ్వు ఎవ్వరికి అన్యాయం చెయ్యటం లేదు. ఎవరి సంతోషంకోసం వాళ్ళు ప్రయత్నించటం పాపం కాదు."

అన్నీ వింది వరలక్ష్మి, ఒక్కమాటనీ మనస్ఫూర్తిగా విశ్వసించలేకపోయింది. శర్మకోరిక కోసం తను లొంగిపోతే అది అవినీతో కాదో వరలక్ష్మికి తెలుసు. పాతికేళ్ళముందు పుట్టినదాదిగా నరనరానా ప్రవహిస్తూవున్న రక్తప్రభావం తనలో అంత తొందరగా మాసిపోయేది కాదు. ఒక్కసారి శర్మ మొహంలోకిచూసి తలదించుకొంటూ నెమ్మదిగా-"ఇక మీరు నాకేమీ చెప్పకండి. నేనేమీ ఆలోచించే స్థితిలోలేను నామీద దయవుంచి వెళ్ళిపోండి" శర్మ సాహసంగా వరలక్ష్మి జుత్తుమీద చెయ్యివేసి నిమరసాగాడు- "ఎందు కింత భయపడుతున్నావు వరలక్ష్మీ! నా కంఠములో ప్రాణం వుండగా మన విషయం ఎవ్వరికీ తెలియనివ్వనని మాట ఇస్తున్నాను సరేనా." లాలనగా అన్నాడు.

వరలక్ష్మి మంచానికి దూరంగా నడిచింది- "నే నిచ్చిన అలుసు చూసి నన్ను బాధ పెట్టకండి. నన్ను వెర్రిదానిగా భావించి ఇక వెళ్ళిపోరాదూ?" ప్రాధేయపూర్వకంగా అంది.

శర్మ నవ్వాడు - "సరసానికైనా విరసానికైనా అంతం వుంటుంది వరలక్ష్మీ! నీకై నువ్వు నాకు సులువులు చెప్పి నన్ను కవ్వించి రప్పించుకున్నావు. నా వూహా ప్రపంచంలో నిన్నెన్ని విధాల ఆరాధిస్తున్నానో, నీతో ఎన్ని స్వర్గ సౌఖ్యాలు వూహించుకున్నానో నీకెలా తెలుస్తుంది? నా ఆవేదన నువ్వు అర్థం చేసుకుంటే ఇంత నిర్దయగా శాసించలేవు. ఒక్కసారి ఇటు చూడు వరలక్ష్మీ ! నా మొహంలోకి చూసి నన్ను పొమ్మని మనస్ఫూర్తిగా చెప్పు." శర్మ కంఠస్వరం జాలిగా ధ్వనించింది. వరలక్ష్మి మొహం తిప్పలేదు. ఎట్లూ

చూడలేదు. పెదవి కొరుక్కొంటూ నేల చూపులు చూస్తూ నించుంది— శర్మ వరలక్ష్మిని దాదాపు చేతుల్లో ఇముడ్చుకుని ముడిలో పువ్వులు ఆఘ్రాణించ బోయాడు.

వరలక్ష్మి విదిలించుకొంది. శక్తికొద్దీ ముడిమీది మాల తీసి నేలకేసి కొట్టింది. చటుక్కున దోసిట్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

కొన్ని నిమిషాలు అచేతనంగా నిలబడ్డ శర్మ సాహసం కూడదీసుకుని మొహానికి అడ్డంగా వున్న వరలక్ష్మి చేతులు తన చేతుల్లోకి తీసుకో బోయాడు— "నన్ను క్షమించు వరలక్ష్మీ! నువ్వింత బాధ పడతావనుకోలేదు. నువ్వంటే నాకు సాను భూతేగాని మరో చెడ్డ వుద్దేశ్యం లేదు." వరలక్ష్మి వెక్కి వెక్కి పడుతూ తల అడ్డంగా తిప్పింది.

"వెళ్ళండి, వెళ్ళండి. నాకు ఎవ్వరి సానుభూతీ అక్కర్లేదు. మీరు నాకోసం చెయ్యగలిగిం దేమీ లేదు. మీకు చేతనైతే నన్ను క్షమించండి— నాకై నేను మిమ్మల్ని రెచ్చ గొట్టాను; నిజమే. అలా ఎందుకుచేశానో నాకు తెలీదు. దాని ఫలిత మేమిటో ఆలోచించలేదు. కోరుకున్న సమయం ఆసన్న మైతే తట్టుకునే శక్తి నాకు లేదు. ఇంకేం చెప్పను? ఏం చెప్పను?"

"వరలక్ష్మీ!" విస్మయంగా పిల్చాడుశర్మ— "నువ్వెందు కింత మధన పడుతున్నావు? నేను నిన్ను అపార్థం చేసు కున్నానా?"

"లేదు. లేదు. నేనే నన్ను అపార్థం చేసుకున్నాను. నేనే నా హృదయాన్ని అర్థం చేసుకోలేక పోయాను. నాలా మరో ఆడది అసంతృప్తితో కుళ్ళి కుళ్ళి ఏడుస్తుందో లేదో, నాలా తేలిగ్గా శీలాన్ని ధ్వంసం చేసుకోటానికి సిద్దపడదు. ఇంత సిగ్గులేకుండా పురుషుణ్ణి ఆహ్వానించదు. ఊహూ! ఏ ఆడదీ చెయ్యదు."

శర్మ ఉదాసీనంగా నవ్వాడు– "నిన్ను నువ్వు కించ పర్చుకోకు వరలక్ష్మి! మరో ఆడది నీకన్నా గొప్ప దంటే నేను ఒప్పుకోను. అదంతా నీ భ్రమ."

"కాదు...కాదు..." వరలక్ష్మి తీక్షణంగా చూస్తూ అంది– "ఇప్పు డంతా భ్రమగానే తోస్తుంది. తెల్లవారితేగాని నా బ్రతుకు బండలు కాదు. సాటి ఏ ఆడదీ నాఆవేదన అర్థం చేసుకోదు. నీతి నియమాల సంఘం ఎన్నటికీ నన్ను సమర్థిం చదు. కట్టుకున్న భర్త కన్నెత్తి చూడటానికైనా ఇష్టపడడు. చివరికి... మీరు... మీరు... కూడ విలువ పోగొట్టుకున్న నన్ను లక్ష్యపెట్టరు. చెప్పండి... ఇందులో ఏది జరగదో చెప్పండి."

"వరలక్ష్మీ" భీతిగా చూశాడు శర్మ– "నీ కేం చెప్పాలో నాకు అర్థంకావటం లేదు."

"ఒద్దు. నాకేం చెప్పకండి. నన్ను సమర్థించటానికి ప్రయత్నించకండి– నా చేతల్ని నేనే సరిపెట్టు కోలేను. నాసాహసాన్ని నేనే ఆమోదించలేను. జీవితంలో అన్ని

విధాలా సుఖపడుతోన్న మీరు నావంటి వాళ్ళని అల్లరి పెట్టకండి."

అయోమయంగా చూశాడు శర్మ. గోడకి తల ఆన్చుకుని ఏడవసాగింది వరలక్ష్మి.

"వరలక్ష్మీ! నీ బాధేమిటో నీకు తెలిసినంతగా మరొకరికి ఎలా తెలుస్తుంది? నీవ్యక్తిత్వంమీద నీకు నమ్మకం లేకుండా నిన్ను నువ్వే సమర్థించుకోలేని పరిస్థితేలా సంభవిస్తుంది?"

తలతిప్పి కన్నీళ్ళతో చూసింది వరలక్ష్మి- "శాశ్వతం కాని అనుభవం కోసం ఈ నీతిని కూడా పోగొట్టుకున్న నాకు జీవితంలో మరేం మిగులుతుంది? నా స్వార్థంకోసం నేనెవరికీ అన్యాయం చెయ్యలేదనే గర్వం చాలదా నా బ్రతుక్కి; భర్తచాటున అబద్ధం బ్రతుకు బ్రతికే నీతిమాలిన దాన్ని కాదనే సంతృప్తి చాలదా నా సంతోషానికి? వద్దు... నాకే సుఖమూ వద్దు. ఇన్నాళ్ళూ నేనెంత పిచ్చిగా ఆలోచించానో ఇప్పుడర్థమౌతోంది. నా అంతరాత్మ కూడా నన్ను అపహసించే పరిస్థితి తెచ్చుకోను."

చాలా సేపు నిశ్శబ్దం ఆవరించింది యిద్దరిమధ్యా. ధారగా పడుతోన్న వర్షపునీరూ- మధ్య మధ్య ఉరుముల చప్పుళ్ళతో నిశ్శబ్దం బంగపడుతోంది.

నేలమీదపడి చిందర వందరైన మల్లెపువ్వుల కేసి చూస్తూ నించున్నాడు శర్మ. ఉన్నట్టుండి తలెత్తి వరలక్ష్మి కేసి చూశాడు.- "వరలక్ష్మీ! నీకు యిప్పుడేకోరికా లేదా?"

"కోరిక !" అస్పష్టంగా అనుకొంది వరలక్ష్మి–"కోరిక– నాకా?" కన్నీళ్ళతో తడిసిన కనురెప్పల్ని అల్లలా డిస్తూ శర్మ మొహంలోకి చూసింది– "ప్రతీ ఆడదానికీ ఏ కోరిక వుంటుందో నాకూ అదే వుంది. ఇల్లాలిగా ఇల్లు దిద్దు కోవాలనీ – భార్యగా భర్త సన్నిధిలో సుఖపడాలనీ... మీ కేం తెలీదూ? మీ భార్యకి అలాంటి కోరికలు లేవూ? తీరని కోరికలకోసం నేను దురాశ పడుతున్నానా? ప్రకృతి విరుద్ధంగా వాంఛలు పెంచుకుంటున్నానా? నాకు కోరికలే లేవని మీ రెలా అనుకున్నారు?" వరలక్ష్మి కన్నీరు చెంపల మీదుగా జారింది – "నేను మనిషిని కానా? నాకు సుఖపడా లని లేదా? నాకు సంతోషమే అక్కర్లేదా?"

ఖిన్నుడై నిలబడ్డాడు శర్మ– "నన్ను క్షమించు వర లక్ష్మీ! నిన్ను అర్థం చేసుకోలేక మూర్ఖంగా ప్రవర్తించాను." వినీ విన్పించకుండా అన్నాడు.

"ఆ తప్పు మీ ఒక్కరిదే కాదు. నా మాట వినండి. నా మీద మీ కెంతో సానుభూతి వుందన్నారు. నా కోరిక మీకు చెప్తాను. ఏమైనా సాయం చెయ్యలేరూ? నాకు చచ్చి పోవాలని వుంది. నిజంగా...నిజంగా...నాకు చచ్చిపోవాలని వుంది."

బావురు మంటూ మొహానికి చేతులు కప్పుకొంది వరలక్ష్మి.

( అక్టోబరు 64, 'యువ'నుంచి )